www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 3 డిసెంబర్ 2024
5
కాకినాడ



సత్యదేవునికి రూ.3 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - శంఖవరం

కార్తీక మాసంలో సత్యదేవునికి హుండీల ద్వారా రూ.3 కోట్లు పైనే ఆదాయం లభించింది. ఈ మాసంలో రెండు పర్యాయాలు హుండీల ఆదాయం లెక్కించారు. రెండో పర్యాయం సోమవారం కొండపైన దేవస్థానం ఇన్‌ఛార్జ ఇఒ వి.త్రినాథరావు, ఛైర్మన్ ఐవి.రోహిత్‌ల ఆధ్వర్యంలో అధికారులు 13 రోజుల్లో భక్తులు వివిధ హుండీలలో వేసిన కానుకలను లెక్కించారు. రూ.1,30,30,404 నగదు, 52 గ్రాముల బంగారం, ఒక కేజీ 525 వెండి లభించింది. కాగా మొదటి పర్యాయం 19 రోజుల్లో వచ్చిన హుండీల ఆదాయం 1.70 కోట్లు రావడంతో వెరసి కార్తీకమాసం మూడు కోట్లు పైనే ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగల ఎఇలు, పర్యవేక్షణ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం రాశులు

-నేల కొరిగిన పంట పొలాలు
-అన్నదాతలకు కన్నీటిని మిగిల్చిన తుపాను

తుపాన్ అన్నదాతలకు కన్నీటిని మిగిల్చింది. మూడు రోజులుగా కురిసిన అకాల వర్షాలతో ధాన్యం రాశులు తడిసిపోయాయి. ముందస్తు హెచ్చరికలతో రైతులు తగుజాగ్రత్తలు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. కళ్ళాల్లో ధాన్యం తడిసిపోగా, వరి పొలాల్లో కోతకు రెడీగా ఉన్న పంటపొలాలు నేలవారాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

తాళ్లరేవు మండలంలోని తాళ్లరేవు, పోలేకుర్రు, పి.మల్లవరం, గ్రాంటు గ్రామాల్లో పంట పొలాలను అకాల వర్షాలు నిండా ముంచాయి. వర్షానికి తోడు ఈదురుగాలులు వేగంగా వీయడంతో పలుచోట్ల పంట పొలాలు నేలకొరిగాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన ఎంటియు 7029 స్వర్ణరకం పంటను చాలా వరకూ మాసూలు చేసినప్పటికీ ఎంటియు 1318 వెరైటీ నిలబడి ఉండటంతో కోతలు కోయలేదు. అయితే అకాల వర్షం, ఈదురు గాలులు వల్ల పలుచోట్ల ఈ పంట నేలకొరిగిపోయింది. ఆలస్యంగా సాగు చేసిన స్వర్ణ రకం కూడా ఈదురుగాలికి పడిపోవడంతో చేతికి వచ్చిన పంట చేజారిపోయిందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో 8,254 ఎకరాలలో వరి సాగు చేయగా సుమారు 80 శాతం వరకు మాసూలు చేశారు. ఇంకా 20 శాతం మేర మాసూలు చేయాల్సివుంది. ఈ పంటను తుపాన్ నాశనం చేసింది. నేలకొరిగిన వరి పంటను పిలకలుగా కట్టి కొంత మేరకు కాపాడుకోవచ్చునని వ్యవసాయ అధికారి ప్రశాంతి అన్నారు. నేలనంటిన వరి పంటపై 5 శాతం ఉప్పు ద్రావణం చల్లడం ద్వారా నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. **కాజులూరు** అకాల వర్షాల వల్ల మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి. మండలంలోని 18,232 ఎకరాల వరి సాగు చేయగా 42 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. రైతు సేవ కేంద్రాల ద్వారా 5000 మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు చేశారు. మరో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు నేరుగా మిల్లర్లకు అమ్మకం చేసుకున్నారు. మరో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉంది. తుపాను కారణంగా కురిసన వర్షాలతో కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి. ఆరుగాలం శ్రమించిన కౌలు రైతులకు ఈ వర్షాలు నష్టాన్ని మిగిల్చాయి. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం నిబంధనలను సడలించి పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని మండలంలోని కౌలు రైతులు కోరుతున్నారు. మండలంలో ఇప్పటివరకు 90 శాతం మాసూళ్లు పూర్తయ్యాయని, ఇప్పటివరకు రైతు సేవ కేంద్రం ద్వారా 5000 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి అశోక్ తెలిపారు. తడిచిన ధాన్యాన్ని నిబంధనల మేరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులెవరు అధైర్య పడవద్దని ఆయన కోరారు. **రౌతులపూడి** తుపాన్ ప్రభావంతో కోతలకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలనంటింది. మండలంలో 1850 హెక్టార్లలో రైతులు వరం పంటను సాగు చేశారు. ఒకటి రెండు రోజుల్లో వరి పంటను కోత కోసేందుకు రైతులు సన్నద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలో తుపాన్ హెచ్చరికలు రావడంతో కోతలను రైతులు వాయిదా వేసుకున్నారు. అప్పటికే పంట వెన్ను విరియడంతో తుపాన్ ప్రభావంతో వీచిన గాలికి, వర్షానకు వెన్ను బరువు ఎక్కి నేలవాలింది. మండలంలోని బలరామపురం, రౌతులపూడి, ములగపూడి, ఎ.మల్లవరం, పిచామవరం, శృంగవరం గ్రామాల్లో వరి పంట అధిక సంఖ్యలో నేలకు ఒరిగింది. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



తాళ్లరేవులో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న కౌలు రైతు కుటుంబం



రౌతులపూడిలో నేలపై ఒరిగిన వరి చేను

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



అకాల వర్షపు నీరు ధాన్యం రాశుల్లోకి చేరింది. తడిసిన ధాన్యంను ఆరబెట్టడానికి ఇబ్బందులు పడుతున్నాం. గింజలోని తేమ శాతం తగ్గే పరిస్థితి లేదు. 2 ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు చేశాను. నాలుగు కుంచాలు మాత్రమే మాసూలు చేయగలిగాను. మిగిలిన ధాన్యం రాశులు పోయగా తడిసిపోయింది. తేమ శాతం చూడకుండా ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

జక్కల చిట్టిబాబు కౌలు రైతు, జై భీమ్ పేట, పోలేకుర్రు పంచాయితీ.

కౌలు రైతులను ఆదుకోవాలి



గత కొన్నేళ్లుగా ఓడలనాలి ఛానల్ పై వ్యవసాయం చేస్తున్నాను. తుపాను ప్రభావంతో స్వర్ణ రకం దెబ్బతింటుందని, ఈ ఏడాది స్వర్ణకు బదులుగా 1318 రకంను ఒక ఎకరంలో సాగు చేశాను. మరొక ఎకరంలో స్వర్ణ రకం సాగు చేసి మాసూలు పూర్తి చేశాను. అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల 1318 రకం సైతం నేలకొరిగింది.కౌలు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

పినిపే గోపాలరావు, కౌలు రైతు, తాళ్లరేవు.

పిడిఎస్ బియ్యం దొంగలను అరెస్టు చేయాలి

-సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పోర్టు నుంచి పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా విదేశాలకు తరలిస్తున్న దొంగలను గుర్తించి అరెస్టుచేయాలని సిపిఎం జిల్లా కమిటీ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ అక్రమ బియ్యం రవాణాకు సహకరి స్తున్న ఆయా ప్రభుత్వ శాఖల అధికారులను కఠినంగా శిక్షించాలని అన్నారు. అక్రమ రవాణాకి వినియో గిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను వినియోగించాలని అన్నారు. కాకినాడలో పిడిఎస్ బియ్యాన్ని గోదాముల్లో నిల్వ చేస్తున్నట్లు మీడియాలో హడావుడి తప్ప ఇప్పటి వరకూ ఆయా గోదాముల నిర్వాహకులపై ఎన్ని కేసులు పెట్టారో బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేవారు. లబ్ధిదారుల నుంచి పిడిఎస్ బియ్యాన్ని ఎవరు సేకరిస్తున్నారు? ఎవరు ఆ బియ్యాన్ని విదేశాలకు తరలిస్తున్నారు? అనే అంశాలపై విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ చేయాలని సిపిఎం కోరుతుందన్నారు. డిప్యూటీ సిఎం పట్టుకున్న బియ్యాన్ని ఎవరు సరఫరా చేశారు? ఎవరు రవాణా చేస్తున్నారు? అనే విషయాలను ఆయనే రాష్ట్ర ప్రజలకు తెలియపర్చాలని కోరారు. కాకినాడ యాంకరేజ్ పోర్ట కార్యకలాపాలపై నిర్ధారణ లేకుండా స్మగిలింగ్, దొంగలు, డ్రగ్స్ వంటి ఆరోపణలు చేయడం తగదన్నారు. అటువంటి అసాంఘిక చర్యలు జరిగితే అందుకు గల కారకులను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల యాంకరేజ్ పోర్ట్‌పై ప్రకటనలు, మాటలు చూస్తుంటే డీప్ వాటర్ పోర్టు నిర్వాహణ సంక్రమంగా జరుగుతున్నట్లు ప్రజలను నమ్మించేందుకే అన్నట్లు అనుమానం కల్గుతుందన్నారు. యాంకరేజ్ పోర్ట్‌ని లేకుండా చేసే కుట్రలు ఉన్నాయనే అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. యాంకరేజ్ పోర్ట్‌పై ఆధారపడి జీవిస్తున్న 20 వేల మంది ప్రత్యక్ష, పరోక్ష కార్మికులు ఏమవ్వాలని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే కాకినాడ పోర్ట్ ఉండగా, పెరుమాళ్ళపురం వద్ద కెజిపిఎల్ పోర్ట్ నిర్మాణం చేపట్టారని, దీనివల్ల కాకినాడ పోర్ట్ వ్యాపారం తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పుడు యాంకరేజ్ పోర్ట్ పేరున జరుగుతున్న దుష్ప్రచారం వల్ల మొత్తం కాకినాడ పోర్ట్ వ్యాపారంపై ప్రతికూల ప్రభావం పడుతుందని, ఎగుమతులు, దిగుమతులపై వ్యతిరేక ప్రభావం పడుతుందన్నారు. కాకినాడ పోర్ట్ ద్వారా జరగాల్సిన లావాదేవీలు గంగవరం, కృష్ణపట్నం పోర్టులకు తరలిపోయే ప్రమాదం ఉందని, దీనివల్ల కాకినాడ జిల్లా కు రెవెన్యూ తగ్గిపోతుం దన్నారు. కాకినాడకు చెడ్డపేరు తెచ్చే చర్యలు, ప్రకటనలు ఎవరు చేసినా వాటిని తక్షణమే ఆపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోర్టును మరింత అభివృద్ధి చేయాలి: సిఐటియు

కాకినాడ పోర్టును మరింతగా అభివృద్ధి చేయాలని సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్స్ పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ ఒక ప్రకటనలో కోరారు. పోర్టును పరిశీలించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పోర్టులో జరుగుతున్న లోపాలు ఏ రీతిలో జరుగుతు న్నాయో స్పష్టం చేయాలన్నారు. పబ్లిక్‌గా ప్రకటన చేయడం వల్ల పోర్ట్‌కి చెడ్డపేరు వచ్చేదిగా ఉంద న్నారు. పోర్టులో అక్రమ బియ్యం రవాణా కోసమే కాకుండా ఇదే పోర్టులో వేలాది మంది కార్మికులకు పడుతున్న ఇబ్బందులను గుర్తిస్తే మంచిదన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కార్మికులకు అమలు కావడం లేదన్నారు. పోర్టును అభివృద్ధి చేయడంతోపాటు, కార్మికులకు మరింతగా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

డాక్టర్ వీర్రాజు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

క్యాన్సర్ రోగులకు డాక్టర్ వీర్రాజు అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు కొనియాడారు. వైద్య రంగంలో అందించిన సేవలకు రెండు అత్యున్నత వైద్య పురస్కారాలు అందుకున్న సూర్య గ్లోబల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వీర్రాజును ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఎంతోమంది క్యాన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి వారికి ప్రాణదానం చేస్తున్న అత్యుత్తమ వైద్యులు డాక్టర్ వీర్రాజు అని కొనియాడారు. ఆయనను కలిసిన వారిలో సుధీర్‌రాజు, రాజా తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ వీర్రాజుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ముదునూరి



ఎంఎల్‌ఎకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

పరిష్కరించకపోతే 9 నుంచి సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరిం చకపోతే ఈ నెల 9 నుంచి సమ్మెలోకి వెళతామని ఇంజనీరింగ్ విభాగం కార్మిక సంఘం స్పష్టం చేసింది. సోమవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పను యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా అతి తక్కువ వేతనాలకు విధులు నిర్వహిస్తున్నామన్నారు. టెక్నికల్ కార్మికులకు రూ.29,200, సాధారణ కార్మికులకు రూ.24,500 వేతనాలుగా ఇవ్వాలని, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు, వైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, 15 సంవత్సరాల సర్వీసు పైబడిన వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేవ్వారు. ఈనెల 9వ తేదీ లోపు తమ సమస్యలు పరిష్కరించకపోతే అదే రోజు నుంచి సమ్మెలోకి వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నాగేశ్వర రావు, కెవి.రమణ, బి.వీరభద్రరావు, బిఎస్. రామారావు, ఎస్‌కె.బషీరుద్దీన్, ఐఎస్ఎ. స్వామి, పి.శ్రీను, ఎస్.సత్తిరాజు పాల్గొన్నారు.

జీడి పిక్కల ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

ఏళేశ్వరం మండలం చిన్నంపేట జీడిపిక్కల ఫ్యాక్టరీని తక్షణమే తెరిపించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు, పరిశ్రమ నాయకులు అనిశెట్టి వీరబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద పరిశ్రమకు చెందిన కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిఎల్‌పిఒ వాసుదేవ రావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 410 మంది పనిచేసే పరిశ్రమను ప్రభుత్వ అనుమతులు లేకుండా చట్ట వ్యతిరేకంగా యాజమ్యాం మూసివేస్తే అధికార యంత్రాం గం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. మెట్ట ప్రాంతంలోని కేరళ, ఆంధ్ర యాజమాన్యాలలోని జీడిపిక్కల పరిశ్రమలు 95 శాతం నడుస్తున్నప్పుడు ముడి సరుకు లేదంటూ పరిశ్రమను మూసివేయడం తగదన్నారు. స్థానిక కార్మికులను తొలగించి వలస కార్మికులతో తక్కువ వేతనాలతో పని చేయించుకోవచ్చనే లాభాపేక్షతోనే పరిశ్రమను యాజమాన్యం మూసివేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక విధానాన్ని ప్రకటిస్తూ 25 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని ప్రచారం చేస్తున్న దని, దానికి భిన్నంగా స్థానిక పరిశ్రమలు మూసి వేయడంతో వేలాది కార్మికులు ఉపాధి కోల్పో తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం కలగజేసుకుని అనుమతులు లేకుండా మూసేసిన పరిశ్రమను తెరిపించి 410 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.చక్రధర్, జయ, చంటి, సత్య, భాగ్యలక్ష్మి, గోవింద్, ధర్మజీ, శివాలక్ష్మి, గోడగాల వీరబాబు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

పిడిఎస్ బియ్యం రీసైక్లింగ్‌పై నిఘా: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

పిడిఎస్ బియ్యం రీ సైక్లింగ్‌పై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పిడిఎస్ బియ్యం రీ సైక్లింగ్‌పై ఎస్‌పి విక్రాంత్‌పాటిల్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంధ్బంగా జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ తరలింపు, రిసైక్లింగ్ పాల్పడుతున్న వారిపై ఇప్పటి వరకూ నమోదు అయిన కేసులు, వాటి విచారణ, అక్రమాలపై చేపట్టిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడిఎస్ బియ్యం అక్రమ తరలింపు నిరోధానికి నిరంతరం పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని, అనుమానిత కార్యకలాపాలపై తనిఖీలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. గతంలో నిర్వహించిన తనిఖీలలో అక్రమ బియ్యం రవాణా, పిడిఎస్ బియ్యం రీసైక్లింగ్ పాల్పడుతున్న వారిపై నమోదు అయిన కేసుల్లో దోషులు పై చట్టపరమైన చర్యలు చేపట్టేం దుకు త్వరితగతిన మరింత లోతైన విచారణ చేయా లని ఆదేశించారు. పౌర సరఫరాలు, పోలీస్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో గత జూన్, జూలై నెలల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా నిర్వహించిన తనిఖీల సందర్భం గా నమోదు చేసిన 13 కేసులపై జరిపిన విచారణ, చేపట్టిన చర్యలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపిఎస్ ఆర్.సుస్మిత, సిపిఒ పి.త్రినాథ్, ఇన్‌ఛార్జ్ డిఎస్ఒ టి.లక్ష్మీప్రసన్నదేవీ, డిఎస్‌పి రఘువీర్ విష్ణు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఆదిత్యలో కాలుష్య నియంత్రణ దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్. నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సమీపంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల వైస్ ప్రిన్సిపల్ సి.సత్యనారాయణ మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించే బాధ్యత ప్రతి ఒక్కరూ పైన ఉందని, లక్షల టన్నుల ప్లాస్టిక్ వాడుతున్నారని, కుప్పలుతెప్పలుగా పడి ఉన్న ప్లాస్టిక్ వలన అనేక అనర్ధాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఐ.గౌరీప్రియ, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఆదిత్య ప్రతినిధులు

మహిళా సమాఖ్య పాలకవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తొండంగి

మండల మహిళా సమాఖ్య పాలకవర్గం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. సోమవారం సాయంత్రం ఎంపిడిఒ రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సమాఖ్య అధ్యక్షురాలుగా బోడపాటి చంటమ్మ, కార్యదర్శిగా కె.కృష్ణవేణి, కోశాధికారిగా కె.బేబి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం 2023-2024లో సాధించిన ప్రగతిపై చర్చించారు. 2024-25లో సాధించాల్సిన కార్యక్రమాన్ని రూపొందించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జెండర్, బాల్యవివాహాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన నూతన పాలకవర్గం

48 గంటల పాటు మద్యం దుకాణాలు మూసివేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 5న ఉమ్మడి తూర్పు - పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే ఉపాధ్యాయ ఎంఎల్‌సి పోలింగ్ జరగనున్న నేపథ్యంలో 48 గంటల పాటు మద్యం దుకాణాలను మూసివేయాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 5వ తేదీ సాయంత్రం 4 గంటల వరకూ తప్పనిసరిగా మద్యం దుకాణాలను మూసివేయాలన్నారు.

5న టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక పోటీ

ప్రజాశక్తి - పెద్దాపురం


రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనే జిల్లా టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక పోటీ ఈనెల 5న పట్టణంలోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కె.మోహన్‌బాబు, శ్రీ ప్రకాష్ స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ - 15 బాలురు, బాలికల కేటగిరిలలో ఈ ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20 నుంచి 22 వరకూ జరిగే ఎపి అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత పొందుతారన్నారు.

నూతన ఎపిఎం నియామకం

ప్రజాశక్తి - పెదపూడి

మండల వెలుగు పథకం ఇన్‌ఛార్జ్ ఎపిఎంపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో నూతన ఎపిఎంగా వి.అరుణ నియమితులయ్యారు. ఆమె సోమవారం విధులకు హాజరయ్యారు. సుమారు నాలుగేళ్లుగా ఇన్‌ఛార్జ్ ఎపిఎంగా విధులు నిర్వహిస్తున్న సిసి చిన్నబాబు పై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే విచారణకు ఎటువంటి ఆటంకం లేకుండా ఆయన స్థానంలో అరుణను ఎపిఎంగా నియమించగా, చిన్నబాబును సిసిగా అధికారులు నియమించారు.

కార్టూ'నిజం'



నీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

ఈ నెల 8వ తేదీన జరుగుతున్న నీటి సంఘాల ఎన్నికల నిర్వాహణపై జిల్లాలోని పలు మండలాల్లో ఎన్నికల అధికారులు, సిబ్బందికి సోమవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణా కార్యక్రమం ఇరిగేషన్ ఎఇ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి పాల్గొని మాట్లాడారు. ఉన్నతాధికారులు నిర్ధేశించిన నియమాల ప్రకారం ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలన్నారు. మండల పరిధిలోని కాండ్రకోట, కట్టమూరు, పెద్దాపురం, పులిమేరు, తిరుపతి గ్రామాల పరిధిలో ఎన్నికలకు సంబంధించి 5వ తేదీన నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ కాంతారావు, ఆర్ఐ రమణ పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలో దుగ్గుదురు, కాజులూరు, శలపాక, పెనుమల్ల, గొల్లపాలెం, మంజేరు, కోలంక, పల్లిపాలెం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఎల్.శివకుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణపై జరిగిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఒక్కొక్క నీటి సంఘం పరిధిలో 12 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. సాధ్యమైనంత వరకు ఎన్నికలను ఏకగ్రీవంగా జరిగేలా అధికారులు రైతులను కోరాలన్నారు. ప్రసార మాధ్యమాలు, టామ్ టామ్ ద్వారా ఎన్నికల గురించి రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు అశోక్ , శంకర్, సాయి, నాగేశ్వర శర్మ, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు. **పెదపూడి** స్థానికంగా జరిగిన శిక్షణా కార్యక్రమంలో తహశీల్దార్ పివి.సీతాపతిరావు పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చడానికి కృషి చేయాలన్నారు. మండలంలో ఏపీత్రయం, కరకుదురు, పెడపూడి, పెద్దాడ, సంపర, జి.మామిడాడ, గండ్రేడు సాగు నీటి సంఘాలకు ఏడుగురు ఎన్నికల పరిశీలకులను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంఇఒ సివివి.సత్య నారాయణ, ఎఒ సిహెచ్ సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారు లు పాల్గొన్నారు. **కరప** స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నందిపాటి సత్యనా రాయణ పాల్గొని మాట్లాడారు. మండలంలోని 9 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు. **జగ్గంపేట** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీరమ ణి, తహశీల్దార్ జెవిఆర్.రమేష్ పాల్గొని మాట్లాడారు. మండలంలోని 16 చెరువులు, నీటి సంఘం ఎన్నికలు జరుగ నున్నాయని తెలిపారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కరపలో జరిగిని శిక్షణలో మాట్లాడుతున్న తహశీల్దార్



జగ్గంపేటలో శిక్షణా తరగతుల్లో ఉద్యోగులు

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- మామిడికుదురు

ఆటో ఢీకొని గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ కెవివిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. రాజోలు మండలం కడలిలోని వాసంశెట్టివారిపాలెనికి చెందిన మాదాసి శివకృష్ణ (35) గత నెల 28న బైక్ పై వెళ చుండగా గెద్దాడ వద్ద ఒక ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివకృష్ణ కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మండపేట మండలంలో నిర్వహించిన దాడుల్లో 75 లీటర్ల నాటుసారాతో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ బిడి నాగేశ్వరరావు తెలిపారు. మండపేట మండలం కేశవరానికి చెందిన కడగాలి రాంబాబు, ఏడిద సావరానికి చెందిన కంద్రేగుల సూరిబాబులను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సిగరెట్ కోసం హత్య..?

ప్రజాశక్తి- మండపేట

ఓ సిగరెట్ ఏకంగా ఓ వ్యక్తి ప్రాణం పోవడానికి కారణమైంది. సిగరెట్ కారణంగా ఇద్దరి మధ్య తలెత్తిన చిరు వివాదం చివరకు హత్య కేసుగా మారింది. ఈ ఘటన మండపేట 7వ వార్డు డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్ స్మారక మందిరం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు. మండపేటకు చెందిన సిందూరపు వీరబాబు భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నాడు. వివాదాల నేపథ్యంలో భార్య, పిల్లలకు కొంతకాలంగా దూరంగా ఉంటున్నాడు. పనిచేసుకుని 7వ వార్డులోని అంబేద్కర్ స్మారక మందిరం వద్ద పడుకుంటున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం పనిచేసి అర్ధరాత్రి స్మారక మందిరం వద్దకు వచ్చి పడుకున్నాడు. నిద్రిస్తుండగా వేమగిరి సురేష్ మద్యం మత్తులో అతని వద్దకు వచ్చాడు. వీరబాబును లేపి సిగరెట్ ఇవ్వాలని అడిగాడు. ఇవ్వక పోవడంతో అరుగుపై పడుకున్న వీరబాబును కిందికి లాగేశాడు. దీంతో వీరబాబు తలకు తీవ్రగాయమైంది. స్థానికులు గమనించి వీరబాబును మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వీరబాబు(36) సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మండపేట టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి కేసు నమోదు చేశారు. డిఎస్‌పి ఆధ్వర్యంలో సిఐ పి.దొరరాజు దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని సిఐ తెలిపారు.

నిందితుని ఇంటికి వెళ్లిన పోలీసు జాగిలం

కేసు దర్యాప్తులో భాగంగా క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బందాలు ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించాయి. పోలీస్ జాగిలంతో ఘటనా స్థలికి చేరుకోగా అది నేరుగా అక్కడ నుంచి పోలీసు స్టేషన్ పక్కనే వున్న సురేష్ ఇంటికి వెళ్లింది.

చెరువులో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన ధర్మయ్య(80) రాజానగరం మండలం తూర్పు గోనగూడెం ఊర చెరువులో పడి మృతి చెందాడు. జీవితంపై విరక్తి చెందిన ధర్మయ్య ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అతని కోసం గాలించినా కన్పించకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివనాగు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే సోమవారం ఆ వృద్ధుడు తూర్పు గోనగూడెం ఊర చెరువులో మృతి చెందివున్నట్లు పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఇటీవల దుర్గాడ రైల్వే ట్రాక్ సమీపంలో ఆత్మహత్యకు పాల్పడిన తోగరు దివ్య కేసులో నిందుతులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పిల్లలు పుట్టలేదని, అదనపు కట్నం కావాలని వేధింపులకు గురి చేయడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి వరుపుల సీతామహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో మృతురాలి భర్త తోగరు రమేష్, అత్త మామలు గొల్ల అబ్బాయి, సత్యవతి, కూతురు గుర్రం వినీలను అరెస్టు చేసినట్లు తెలిపారు.



800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జున్‌రావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న సిఎంఒ ప్రత్యేక కార్యదర్శి

ప్రజాశక్తి - సామర్లకోట

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక కార్యదర్శి దున్న శిల్ప దంపతులు కుటుంబ సమేతంగా సామర్లకోట భీమేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇఒ బల్ల నీలకంఠం ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. స్వామి, అమ్మ వార్ల దర్శనం అనంతరం ఆలయ నంది మండపంలో పండితులు వేద ఆశీస్సులు అందించారు. అలాగే శ్రీకాకుళం ఎంఎల్‌ఎ గొండు శంకర్రావు స్వామి వారిని దర్శించుకున్నారు. ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్, ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ప్రసాదాన్ని అందజేశారు.

పోలింగ్‌ను సమర్ధవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 5న జిల్లాలో జరిగే ఉపాధ్యాయ ఎంఎల్‌సి పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సమర్ధవంతంగా నిర్వహించాలని ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఏఆర్‌ఒ, డిఆర్‌ఒ జె.వెంకటరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో పోలింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలు సంబంధించి తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయుల నియోజకవర్గం ఎన్నికలు -2024 పోలింగ్ కేంద్రాల్లో విధులు- పోలింగ్ ప్రక్రియ పోలింగ్ మెటీరియల్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, పిఒ డైరీ, మైక్రో అబ్జర్వర్ల విధులు, పోలింగ్ కేంద్రాలు, ఫర్నిచర్, విద్యుత్, పోలింగ్ రోజున అనుసరించాల్సిన విధానం వంటి అంశాలను పోలింగ్ సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎంఎల్‌సి పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పోలింగ్ సిబ్బందికి కృషి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఆరు జిల్లాలో మొత్తం 16, 737 మందికి 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 3,418 ఓటర్లు గాను 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ఈ నెల 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు జెఎన్‌టియుకెలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముకు తరలించేంతవరకు అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సిబ్బంది అంతా సమర్ధవంతంగా పని చేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం ఉప తహశీల్దార్ ఎం.జగన్నాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకట్రావు

అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం

ప్రజాశక్తి - కాకినాడ, పెద్దాపురం



పిజిఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 308 అర్జీలు వచ్చాయన్నారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అందిన వినతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వివిధ శాఖలకు అందిన వినతులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, సిపిఒ పి.త్రినాథ్, బిసి కార్పొరేషన్ ఈడి ఎ.శ్రీనివాసరావు, కెఎస్‌ఇజెడ్ ఎస్‌డిసి రామలక్ష్మి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. పెద్దాపురంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో 9 అర్జీలు వచ్చినట్లు ఆర్‌డిఒ శ్రీరమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఎఒ మాధవరావు, అడిషనల్ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సరిత, డివైఇఒ ఇ.ప్రభాకర్ శర్మ, హౌసింగ్ ఎఇ రవిశంకర్, సిడిపిఒ జి.ఉష, డిప్యూటీ తహశీల్దార్ భానుకుమార్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో డిప్యూటీ జెడి తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట



తనిఖీలు నిర్వహిస్తున్న డిప్యూటీ జెడి

మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో జిల్లా వనరుల కేంద్రం ఉప సంయుక్త సంచాలకులు వివిఎస్.హరి సోమవారం తనిఖీలు నిర్వహించారు. తొలుత పెదబ్రహ్మ దేవం లోని శ్రీ లక్ష్మీకళ్యాణ్ ఎంటర్ ప్రైజస్, వేట్లపాలెంలోని శ్రీ సత్యసాయి ఏజెన్సీస్‌లో తనిఖీలు చేపట్టారు. ఎరువులు, పురుగుమందుల అమ్మకాలకు సంబంధించి ఫారం ఓలు, పిసీలు, ఎరువుల, పురుగుమందుల స్టాకు రిజిస్టర్లు, బిల్ బుక్‌లు అమ్మకం, కొనుగోలు రిజిస్టరులు, ఫిజికల్ స్టాకు, రిజిస్టర్‌లో స్టాకు వివరాలను పరిశీలించారు. రైతులకు ఇవ్వాల్సిన బిల్ కాపీ ప్రభుత్వం సూచించిన ఫారం ఎం విధానం కాకుండా వేరేలా ఉండటంతో రెండు షాపులకు కలిపి రూ.8,03,635కు స్టాప్ సేల్స్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సంజీవ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ఇమ్మిడిసెట్టి సత్య పాల్గొన్నారు.

పలువురికి జ్యోతుల నవీన్ పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి



మండలంలోని యర్రంపాలెం గ్రామంలో పలు కుటుంబాలను టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సోమవారం పరామర్శించారు. తొలుత కిడ్నీలో రాళ్లకు సంబంధించి ఆపరేషన్ చేయించుకున్న ఉప సర్పంచ్ ముత్యాల దుర్గారావును పరామర్శించారు. అలాగే మాతృ వియోగంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ ముత్యాల వీరభద్రరావును, గున్నం శ్రీనివాస్ మృతితో బాధపడుతున్న ఆయన కుటుంబాన్ని, మాతృవియోగంతో బాధపడు తున్న పంచాయతీ వార్డు సభ్యులు ముత్యాల వీర వెంకట సత్యనారాయణను, మృతి చెందిన చింతపల్లి బాబురావు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, నియోజవర్గం తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి, ముత్యాల భాస్కరరావు, ముత్యాల వీరభద్రరావు, బిక్కిన వెంకట్రావు, పెదపాటి శుభకార్, ముత్యాల సతీష్, భద్రరావు పాల్గొన్నారు.

నాణ్యతలేని మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థులకు పాఠశాలలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజనం నాణ్యత లోపాలతో నిర్వహించబడుతుందని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ అన్నారు. సోమవారం ఆయన మానవ హక్కుల సంఘం కార్యదర్శి కుంచే నానిబాబు, సభ్యులు కెవి.లక్ష్మికలిసి స్థానిక సాగర్ మున్సిపల్ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుడ్లు చిన్నవిగా ఉన్నాయని, భోజనంలో నాణ్యత లోపం కనిపిస్తుందన్నారు. ఈ సమస్యలన్నింటిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి దోహదం చేసే కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో తాడిశెట్టి గంగ అధ్యక్షతన జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయన్నారు. ఈ సంక్షేమ పథకాల ద్వారా పిల్లల చదువులు, వివాహాలు, ప్రమాదాలు వంటి అనేక పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం లక్షలాది కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పెదిరెడ్ల విష్ణు, షేక్ ఇబ్రహీం, జోకా సూర్యనారాయణ, షేక్ భాషా, రొంగల రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు ఉత్తమ సేవలు

ప్రజాశక్తి - గండేపల్లి

ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు ఉత్తమ వైద్య సేవలను అందిస్తున్నామని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సరిత అన్నారు. సోమవారం స్థానిక పిహెచ్‌సి, సచివాలయం-2 వద్ద 104 ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలక వ్యాధులు ఉన్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో అధిక డబ్బును వెచ్చించి వైద్యం చేయించుకోవాల్సిన అవసరం లేదని, ప్రభుత్వాసుపత్రిలో అన్ని సౌకర్యాలతో వైద్య సేవలను అందిస్తున్నామని గమనించాలని కోరారు. ప్రభుత్వాసుపత్రితో అందిస్తున్న వైద్య సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ డేను పండగ వాతావరణంలో నిర్వహించాలని ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించి పేరెంట్స్ డే ఏర్పాట్లను హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, ఎస్‌ఎంసి ఛైర్మన్ అక్కిన చక్రధర్ సమీక్షించారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పేరెంట్స్‌కు అంద చేయడానికి సిద్ధం చేసినట్లు హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ వివరించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా వడ్డించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి స్కూల్‌లోను పేరెంట్స్ అందరూ హాజరయ్యేలా దృష్టి సారించాలన్నారు. డిసెంబర్ 4న 3, 6, 9 తరగతులకి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్)పరీక్షను ఎంపిక చేసిన ఆరు స్కూల్స్‌లో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసి సభ్యులు పి.సతీష్, ఎం.దేవి, లక్ష్మి, టి.రాఘవ, కె.అరుణ పాల్గొన్నారు.

పోర్టులో అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పోర్ట్‌లో జరుగుతున్న అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని సిపిఐ రాష్ట్ర నాయకుడు టి.మధు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ పోర్టుకు ఎంతో చరిత్ర ఉందని, పోర్టును నమ్ముకుని సుమారు 30 వేల కార్మిక కుటుంబాలు జీవిస్తున్నాయని అన్నారు. వైసిపి పాలనలో పిడిస్ బియ్యం ఆఫ్రికా దేశాలకు తరలి వెళ్లాయని, మాజీ ప్రజాప్రతినిధి చేతుల్లో ఇవన్నీ సాగాయని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు వాస్తవం అయితే తక్షణమే సిబిఐ విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. పిడిఎస్ బియ్యం ఎగుమతులను నివారించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించి అడ్డుకట్ట వేయాలని అన్నారు. ఈ సమావే శంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ పాల్గొన్నారు.

ముగిసిన పాస్టర్స్ ఐక్య క్రిస్మస్ సభలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న 33వ వార్షిక మహాసభలు ఘనంగా ముగిశాయి. అసోసియేషన్ అధ్యక్షులు రెవ డాక్టర్ ఎం.సాల్మన్ రాజు అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ వేడుకలో మాత్యూస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధుల చేతుల మీదిగా క్యాండిల్ సర్వీస్ నిర్వహించి, ప్రత్యేక కేకును కోసి ఐక్య క్రిస్మస్ వేడుకలను ప్రజలతో కలసి నిర్వహించారు. మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యావర్గాన్ని ఈ సందర్భంగా ప్రకటించి పరిచయం చేశారు. నూతన అధ్యక్షులుగా రెవ. టి.బ్లెస్సింగ్, కార్యదర్శిగా రెవ. కె.జయబాబు, కోశాధికారిగా రెవ. వై.కరుణకుమార్, ఉపాధ్యక్షులుగా రెవ. పి.తిమోతి, సహాయ కార్యదర్శులుగా రెవ. వి.డేవిడ్‌రాజు, రెవ. పి.విజయబాబు, పాస్టర్ ఎస్ సైలాస్, పాస్టర్ వై.రాము మోసెస్, సహాయ .కోశాధికారిగా రెవ. ఎన్.బెంజిమెన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధ్యక్షులు ఆక్టర్ సాల్మన్ రాజు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వంకా జాన్, రొట్టా లాజరస్, ఎ.చంటి, ఆనంద్ జోసెఫ్, జి.విశ్వేశ్వరరావు, ఎన్.రాజు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో మల్లేపల్లి గ్రామంలో కార్తికమాసం ముగింపు సందర్భంగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



శాయ్ స్పోర్ట్స్ రీజినల్ డైరెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - యానాం

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) రీజనల్ డైరెక్టర్ కిషోర్ సోమవారం యానాంలో పర్యటించారు. స్థానిక జిఎంసి బాలాజీ క్రీడా ప్రాంగణంలో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బ్రాంచ్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సాయి స్పోర్ట్స్ యానాంలో రావడానికి గల కారణాలు, ఏర్పాటు చేసిన, చేయాల్సిన సౌకర్యాలు, ప్రభుత్వపరంగా చేసిన సదుపాయాలు తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా యానాంలో మరిన్ని క్రీడా విభాగాలు కేటాయించాలని డైరెక్టర్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయి స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ ఉదయ్ పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్

ప్రజాశక్తి - యానాం

యానాం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం పాస్టర్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త తోట రాజు, ఐ.పోలవరం జడ్‌పిటిసి ముదునూరి సతీష్ రాజు పాల్గొన్నారు. స్థానిక పెర్రి రోడ్డులో గల సమస్త జనుల ప్రార్థన మందిరంలో యానం పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు డేవిడ్ సమక్షంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోట రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో పాస్టర్లకు ఏ అవసరం వచ్చినా తన సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ముఖ్య అతిథులను పాస్టర్స్ ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్స్ జోసఫ్, వంగలపూడి విజయ్‌కుమార్, పిడి ప్రసాద్, డి.ప్రసాద్, పి.ప్రసాద్, కర్రి రాజు, సమర్పణరావు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు



మండలంలోని గోవ లంక పంచాయతీ స్థలంలో ఆక్రమణలను రెండు రోజుల్లో తొలగించాలని ఇన్‌ఛార్జ్ ఇఒపిఆర్‌డి నున్న శంకర నారాయణ ఆధ్వర్యంలో అధికారులు బృందం సోమవారం నివాసితులకు స్పష్టం చేశారు. అయితే తాము 50 ఏళ్లుగా ఇదే స్థలంలో నివసిస్తున్నామని, గతంలో ఉన్న పూరిపాకను తొలగించి పక్కా ఇంటిని నిర్మించుకుంటున్నామని, ఆయా నిర్మాణాలను అడ్డుకోవద్దని, దీనికి సంబంధించి కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని కొట్నాల దేవానందం, కొట్నాల మధు తెలిపారు. ఈ స్థలాల్లోనే నివాసం ఉండటంతో ప్రభుత్వాలు ఇస్తున్న పేదలకు ఇచ్చే ఉచిత స్థలాలు మాకు ఇవ్వడం లేదన్నారు. ఈ స్థలంలోనే ఇల్లు నిర్మించుకునేలా కలెక్టర్, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు అనుమతులు ఇవ్వాలని కోరారు. దీనిపై ఇఒపిఆర్‌డి నున్న శంకరనారాయణ, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ గోవలంక పంచాయతీకి చెందిన సర్వేనెంబర్ 52/4 లోని 16 సెంట్లు కామన్ స్థలంలో పలు ఆక్రమణలు జరిగాయని, అయితే ఇటీవల నిర్మాణం ప్రారంభించిన భవనాన్ని తొలగించాలని కలెక్టర్ ఆదేశాలను అమలు చేస్తున్నామని అన్నారు. నిర్మాణదారులు కోరిక మేరకు రెండు రోజుల సమయం ఇచ్చామని అన్నారు. ఈ బృందంలో కోరంగి పంచాయతీ కార్యదర్శి విజెవి.రమణ, చొల్లంగి పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు ఉన్నారు.

నిత్యం ప్రజలతోనే ఉంటా : ముద్రగడ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



పెద్దలతో మాట్లాడుతున్న ముద్రగడ

నిత్యం ప్రజలతోనే ఉంటామని వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. సోమవారం మండలంలో రాచపల్లి గ్రామంలో గంగాలమ్మ తల్లిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి సామాజికవర్గంతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. ఆ సామాజికవర్గం తన కుటుంబాన్ని ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకునే ఉంటుందన్నారు. జగన్ పాలనలో అన్ని సంక్షేమ పథకాలు లబ్ధిదారుని ఇంటికే వచ్చేవని, అందుకు వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని అన్నారు. ఎన్నికల ముందుకు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మభ్య పెడుతున్నాయని విమర్శించారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ పర్యటనలో వైసిపి నాయకులు ముద్రగడ గిరిబాబు, గణేశుల లక్ష్మణరావు, సర్పంచ్ సారిపల్లి గంగరాజు, లోవలక్ష్మి, వైస్ ఎంపి బంక్ శ్రీను, రామకుర్తి వెంకటరాజా పాల్గొన్నారు.

నేటి నుంచి షష్టి ఉత్సవాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చదలాడ గ్రామంలో నేటి నుంచి సుబ్రహ్మణ్యస్వామి షష్టి ఉత్సవాలు ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. షష్టి మహోత్సవ పోస్టర్‌ను ఎంఎల్‌ఎ నిమ్మకాయల చిన్న రాజప్ప తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ షష్టి ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. 7 వ తేదీన బాణాసంచా పోటీలు, శూలాల సంబరాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

బీచ్‌లో బైకులపై యువకుల హల్‌చల్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి



ఒకే బైకుపై ఐదురు ప్రయాణిస్నుతన యువకులు

ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ యువత ప్రమాదాల బారిన పడుతుంది. ఉప్పాడ కాకినాడ సాగర తీరం ఎంతో ఆహ్లాదకరంగా ఉండడంతో తీరంలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం సమయంలో కుటుంబ సభ్యులతో వచ్చి సేద తీరేందుకు అనువుగా ఉండడంతో అనేక మంది వస్తూ ఉంటారు. కొంతమంది యువకులు ద్విచక్ర వాహనాలపై ఐదుగురు, ముగ్గురు ప్రయాణిస్తూ సేద తీరేందుకు వచ్చిన పర్యాటకులపై హల్చల్ చేస్తూ బైక్ రైడింగ్‌లు చేస్తున్నారు. ఇవి గమనించిన పర్యాటకులు బెంబేలెత్తి పోతున్నారు. పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసిన ఫలితం ఉండటం లేదు. నిత్యం నేమం సెంటర్లో సాయంత్రం సమయాల్లో పోలీసులు తనిఖీ నిర్వహిస్తున్న యువకులు మాత్రం భేఖాతరు చేస్తున్నారు. లైసెన్స్‌లు లేకపోయినా ద్విచక్ర వాహనాలపై హల్చల్ చేయడంపై పలువురు ఆందోళన చెందుతున్నారు. ఆకతాయిలు చేసే నిర్వాకంతో ఎగురుగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. ఆగతాయిలపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.